సరిహద్దు ప్రాంతంలో పులిజాడ లేదు

తనిఖీలు చేస్తున్న అధికారులు

జీలుగుమిల్లి: మండలంలోని రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో పులి కనిపించిందంటూ వస్తున్న ఆరోపణల నేపథ్యంలో శనివారం మండలంలోని కామయ్యపాలెం, రాచన్నగూడెం అటవీప్రాంత సమీపంలో అటవీశాఖ అధికారులు జల్లెడపట్టారు. ఆ ప్రాంతంలో పులి పాదముద్రలు ఏమైనా కన్పిస్తాయేమో అని క్షుణ్ణంగా పరిశీలించామని అటవీ శాఖ సెక్షన్ అధికారి దినేష్ తెలిపారు. అయితే అలాంటి పాదముద్రలేవీ కనిపించలేదన్నారు. అనంతరం తెలంగాణ ప్రాంత అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు మారేష్, భవాని, బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆఖిరి శ్వాస వరకూ ప్రజా పోరాటాల్లోనే

ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మృతితో శోకసంద్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు

ఉపాధ్యాయ సంఘం నేతగా 30 ఏళ్లు ఎనలేని సేవలు

ఎంఎల్‌సిగా సాగిన 33 నెలలు నిత్యం ప్రజల్లోనే

మండలి, జెడ్‌పి, ప్రభుత్వ సమావేశాల్లో ప్రజాగళం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ఆఖరిశ్వాస వరకూ ప్రజాపోరాటాలే ఊపిరిగా ముందుకు సాగారు. సాబ్జీ మృతికి కొద్ది నిముషాల ముందు సైతం ఆయన కైకలూరు, ఆకివీడులోని అంగన్‌వాడీ ఉద్యోగుల ఆందోళనల్లో పాల్గొన్నారు, భీమవరంలో జరుగుతున్న ఆశాల ఆందోళనలో పాల్గొనేందుకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఉద్యోగ, ఉపాధ్యాయులనే కాకుండా బడుగు జీవులను సైతం శోకసంద్రంలో ముంచెత్తింది. ఆయనతో ఉన్న స్నేహాన్ని, ఆయన చేసిన సహాయాలను, కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలిచిన తీరును గుర్తు చేసుకుంటూ అంతా తీవ్ర ఆవేదనలో మునిగిపోయారు. సాబ్జీ ఉపాధ్యాయ నేత నుంచి 2021 మార్చి 14న జరిగిన ఉభయగోదావరి ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలిచి ప్రజాజీవితంలోకి అడుగుపెట్టారు. ఎంఎల్‌సి గెలిచిన తర్వాత నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం చేస్తూనే ఉన్నారు. ఉభయగోదావరి జిల్లాల్లో జరిగే ఆందోళనల్లో ఆయన ప్రత్యక్షంగా పాల్గొని మద్దతుగా నిలిచేవారు. జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగిన ప్రతి ఆందోళనలో ఆయన భాగస్వామిగా ఉన్నారు. సిపిఎస్‌ను వ్యతిరేకిస్తూ ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున జరిగిన ఆందోళనలో ఎంఎల్‌సిగా సాబ్జీ పాత్ర గురించి ఎంతచెప్పినా తక్కువే. ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రతి సమస్యను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడమే కాకుండా, ఆందోళనలు, నిరసనల్లో కార్యక్రమంలో ప్రత్యేక్షంగా పాల్గొని తనదైన శైలిలో పోరాటం జరిపేవారు. వ్యవసాయ కార్మికులు, రైతులు, కౌలురైతుల పోరాటాల్లో భాగస్వాములయ్యారు. ఏలూరులో డిగ్రీ కాలేజీ భవనాల నిర్మాణంపై విద్యార్థుల పోరాటానికి, ఎయిడెడ్ పాఠశాలల మూసివేతపై చేపట్టిన ఆందోళనల్లో, స్కూళ్ల విలీనం సందర్భంగా చేపట్టిన నిరసనల్లోనూ, ఇలా ఏ ప్రజాసమస్యపై ఆందోళన, నిరసన సాగిన ఎంఎల్‌సి సాబ్జీ అక్కడకు చేరుకుని తన గళం వినిపించేవారు. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల్లోనూ, ఏలూరు నగరపాలకసంస్థలో, కలెక్టరేట్‌లో జరిగే సమీక్ష సమావేశాల్లోనూ ప్రజా సమస్యలపై తనదైన శైలిలో సమస్యను ప్రస్తావించేవారు. ఆర్థిక స్తోమత లేక చదువుకునేందుకు ఇబ్బంది పడుతున్న అనేక మంది పేదవిద్యార్థులకు అండగా నిలిచారు.

ధరలో కోత.. రైతుకు వాత..!

రంగుమారిన ధాన్యం కొనుగోలుకు ఆదేశాలివ్వని ప్రభుత్వం

అయినకాడికి అమ్ముకుంటున్న అన్నదాత

కిలోల లెక్కన కోత విధిస్తున్న వ్యాపారులు

రబీ పనుల నేపథ్యంలో వేగంగా మాసూళ్లు

తక్కువగా లెక్కించినా ఎకరాకు రూ.ఐదు వేల వరకూ నష్టం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రంగుమారిన ధాన్యం అమ్మకాల్లో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. తడిసిన, రంగుమారిన ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వం అధికారికంగా ఇప్పటి వరకూ ఎటువంటి ఆదేశాలూ విడుదల చేయలేదు. దీంతో తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని రైతులు అయినకాడికి తెగనమ్ముకుంటున్న పరిస్థితి రెండు జిల్లాల్లోనూ నెలకొంది. కేజీల లెక్కన కోత విధిస్తున్నప్పటికీ దిక్కులేని పరిస్థితుల్లో రైతులు ధాన్యం వ్యాపారులకు విక్రయిస్తున్నారు. దీంతో కనీసంగా లెక్కించినా ఎకరాకు రూ.ఐదువేల వరకూ నష్టపోతున్నట్లు రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ సాగు చేపట్టారు. తుపాను వచ్చేనాటికి దాదాపు లక్షా 60 వేల ఎకరాల్లో రైతులు మాసూళ్లు పూర్తి చేశారు. ఇంకా రెండు లక్షలకుపైగా ఎకరాల్లో రైతులు కోత కోయలేదు. తుపాను దెబ్బకు మాసూళ్లు చేసిన ధాన్యపు రాశులు తడిచి ముద్దవ్వగా, మాసూలు చేయని పొలాలు నేలనంటి నీటిలో నానిపోయాయి. దీంతో ధాన్యం రంగుమారి, మొలకలు వచ్చాయి. తుపాను వెళ్లిపోయి వారాలు గడుస్తున్నా రంగుమారిన ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం ఆదేశాలు విడుదల చేయలేదు. రంగుమారిన ధాన్యానికి సంబంధించి శాంపిళ్ల సేకరణపై కేంద్ర బృందం గురువారం జిల్లాలో హడావుడి చేసింది. రైతులతో కనీసం మాట్లాడకుండా మండలానికి ఒక ధాన్యం శాంపిల్ తీసుకుని వెళ్లిపోయారు. రబీ సాగుకు సంబంధించి ఇప్పటికే నారుమడులు ఆలస్యమయ్యాయి. దీంతో వెంటనే నారుమడులు వేసేందుకు రైతులు హైరానా పడుతున్నారు. ఈ క్రమంలో ఖరీఫ్ మాసూళ్ళ వేగంగా చేస్తున్నారు. అయితే రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయపోవడంతో రైతులకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. దీంతో ఆఫ్‌లైన్‌లో మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేస్తుండటంతో అయినకాడికి అమ్ముకుంటున్నారు. తేమ 17 శాతంకంటే ఎక్కువ ఉంటే బస్తాకు కిలో ధాన్యం తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. దీంతో బస్తాకు నాలుగైదు కిలోలు రైతులు నష్టపోతున్నారు. రంగుమారిన ధాన్యానికి సంబంధించి మిల్లర్లు ఎంత చెబితే అంతన్నట్లు పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం రంగుమారిన ధాన్యం ఎక్కువగా వస్తోంది. కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దెబ్బతిన్న రైతులను ఆదుకోవడం అంటే ఇదేనా అంటూ అన్నదాత ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు.

17 శాతం తేమ వచ్చినా కొనుగోళ్లు ఆలస్యమే

రైతుభరోసా కేంద్రంలో తేమ 17 శాతమే వచ్చినప్పటికీ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడం లేదు. మరో రెండు రోజులు ఆరబెట్టాలంటూ రైతులపై ఒత్తిడి తెస్తున్నారు. ధాన్యం సంచుల్లో పట్టిన తర్వాత కూడా ధాన్యం తీసుకెళ్లకుండా రోజుల తరబడి ధాన్యం కళ్లాల్లోనే ఉంచుతున్నారు. గడిచిన రెండు రోజులుగా వాతావరణం మబ్బుగా ఉంటుంది. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే తుపాను కోలుకోలేని దెబ్బతీసింది. వర్షం కురిసి ఉన్న ధాన్యం కూడా తడిస్తే ఏం చేయాలంటూ రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రంగుమారిన ధాన్యం కొనుగోలుకు వెంటనే ఆదేశాలు జారీ చేయాలని రైతులు కోరుతున్నారు.

నేడు సాబ్జీ అంత్యక్రియలు

ప్రజల సందర్శనార్థం ఇండోర్ స్టేడియంకు తరలింపు

తరలిరానున్న ప్రముఖులు, సంఘాల నేతలు

ఏలూరు ప్రతినిధి: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి, ఉపాధ్యాయ ఉద్యమనేత షేక్ సాబ్జీ భౌతికకాయానికి ఆదివారం ఏలూరులో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం చెరుకువాడ వద్ద శుక్రవారం రోడ్డుప్రమాదంలో సాబ్జీ మృతి చెందిన సంగతి తెలిసిందే. భీమవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం అదే రోజు రాత్రి ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపర్చారు. సాబ్జీ కుమార్తె ఆర్షియా అమెరికా నుంచి ఆదివారం ఉదయం రానున్నారు. దీంతో సాబ్జీ అంత్యక్రియలకు కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.30 గంటలకు ఆశ్రం ఆసుపత్రి నుంచి సాబ్జీ భౌతికకాయాన్ని ఏలూరులోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయానికి తీసుకువస్తారు. అక్కడ కొద్దిసేపు ఉంచి, అనంతరం ప్రజల సందర్శనార్థం కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఇండోర్ స్టేడియానికి తీసుకెళ్తారు. అక్కడ నుంచి సాబ్జీ స్వగృహానికి తరలించి కొద్దిసేపు అక్కడ ఉంచుతారు. అనంతరం అంతిమయాత్ర ప్రారంభమవుతుంది. సత్రంపాడు, శాంతినగర్, కొత్తబస్టాండ్, ఫైర్ స్టేషన్, జ్యూట్‌మిల్లు వంతెన మీదుగా పడమరవీధిలోని శ్మశానవాటిక వరకూ అంతిమయాత్ర సాగనుంది. అంతిమ వీడ్కోలులో పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుతోపాటు సిపిఎం రాష్ట్ర నాయకులు, వివిధ పార్టీల, సంఘాల నేతలు, పిడిఎఫ్ ఎంఎల్‌సిలు కెఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి వి.బాల సుబ్రమణ్యం, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, జిల్లా అధికారులు సాబ్జీ భౌతికకాయానికి నివాళులర్పించనున్నారు. సాయంత్రం మూడు గంటలకు యుటిఎఫ్ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించనున్నారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్య క్రియలు నిర్వహించాలని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ ఉత్తర్వులు జారీ చేయడంతో అందుకు సంబంధించిన ఏర్పాట్లల్లో అధికారులు నిమగ్నమయ్యారు.

'పట్టిసీమ' నీటితో చెరువులు నింపాలని ధర్నా

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

వర్షాభావం నేపథ్యంలో పట్టిసీమ కాలువ నీటితో చెరువులు నింపాలని ఏపి రైతుసంఘం ఆధ్వర్యంలో ఎం.నాగులపల్లి సచివాలయం వద్ద రైతులు శనివారం ధర్నా నిర్వహించారు. పట్టిసీమ కాలువ నీటితో చెరువులు నింపి సాగు, తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. అనంతరం తహశీల్దార్ సతీష్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో వర్షాలు కురవకపోవడంతో కరువు పరిస్థితులు ఏర్పడుతున్నాయని చెప్పారు. ఎం.నాగులపల్లి చెరువులో చుక్కనీరు లేదన్నారు. భూగర్భజలాల సైతం అడుగంటి భవిష్యత్తులో పంటలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. పశువులు తాగడానికి నీరు దొరకడంలేదన్నారు. ఈ పరిస్థితుల్లో పట్టిసీమ కాలువ ద్వారా ప్రవహిస్తున్న నీటితో చెరువులు నింపాలని డిమాండ్ చేశారు. పట్టిసీమ నీటితో సాగు, తాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, మండల అధ్యక్షులు బోయపాటి సత్యనారాయణ, నాయకులు నందమూరి త్రినాథ్, యలమర్తి రాంబాబు, కట్టా శ్రీనివాసరావు, తూంపాటి మురళీ, యాంద్రపాటి వెంకట్రావు, నందమూరి సుబ్బారావు, నందమూరి రవి పాల్గొన్నారు.

తగ్గేదేలే..!

ప్రభుత్వ నిర్బంధాన్ని ప్రతిఘటిస్తున్న అంగన్వాడీలు

ప్రభుత్వంతో చర్చలు విఫలం

సమ్మె మరింత ఉధృతం

సమస్యలు పరిష్కరించకపోతే ప్రత్యేక కార్యాచరణకు సిద్ధం

నేడు జిల్లావ్యాప్తంగా అంగన్వాడీ చిన్నారుల తల్లులకు సమస్యల విన్నపం

ప్రజాశక్తి - భీమవరం

తమ సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మెపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నా వెరవకుండా మొక్కవోని దీక్షతో తమ ఆందోళన వివిధరూపాల్లో సాగిస్తున్నారు. ఐదు రోజులుగా సమ్మె జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకుండా అనూహ్య చర్యలకు దిగడం అందరినీ విస్మయపరుస్తోంది. కేంద్రాల తాళాలు పగులగొట్టమని ఆదేశాలిచ్చిన ప్రభుత్వం ఆపై తాము చెప్పలేదని మాట మార్చింది. మూడుసార్లు యూనియన్లతో ప్రభుత్వం చర్చలు జరిపినప్పటికీ విఫలమయ్యాయి. ఈ నేపథ్యంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే తాము ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధంగా ఉన్నామని అంగన్వాడీ యూనియన్ నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడంతోపాటు చిన్నారుల ఆలనాపాలనా చూసి వారి బంగారు భవిష్యత్తుకు ప్రాథమిక విద్య అందించడంలో అంగన్వాడీలు కీలకపాత్ర పోషిస్తున్నారు. అయితే ఈ కేంద్రాల్లో పని చేస్తున్న అంగన్వాడీలు అనేక రకాల సమస్యలతో నాలుగేళ్ల నుంచి సతమతమవుతూ ప్రభుత్వానికి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో ఈ నెల 13 నుంచి తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెలోకి వెళ్లారు. జిల్లాలో మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 70, మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు 1500 వరకూ ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో ఆయాలు, టీచర్లు కలిపి సుమారు మూడు వేల మంది వరకూ పని చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని కేంద్రాలకు తాళాలు వేసి సమ్మె కొనసాగిస్తున్నారు. ఐదు రోజుల నుంచి జిల్లాలో అంగన్వాడీల ఆందోళనలు మిన్నంటాయి. కళ్లకు, నోటికి నల్ల రిబ్బన్లు కట్టుకుని, మోకాళ్లపై నిలబడి, నలుపు చీరలు ధరించి, ర్యాలీలు, ప్రదర్శనలు చేసి అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. అయినా ప్రభుత్వంలో కనీసం చలనం లేకుండా సమ్మెను నిర్వీర్యం చేసేందుకు పూనుకుంది. అంగన్వాడీల్లో అలజడి సృష్టించి సమ్మెను విరమింపజేసేందుకు అనేక వికృత చర్యలకు పాల్పడింది. అంగన్వాడీ కేంద్రాల నిర్వహణ బాధ్యతను సచివాలయ అధికారులకు అప్పగించే చర్యలకు పూనుకుంది.

నేటితో డెడ్‌లైన్.. ప్రత్యేక కార్యాచరణకు సిద్ధం

సమ్మె నేపథ్యంలో ప్రభుత్వంతో జరిగిన చర్చలు విఫలమయ్యాయి. మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఉన్నతాధికారులతో సుదీర్ఘంగా మూడు గంటలపాటు చర్చలు జరిగినప్పటికీ ఫలితం లేదు. ఇప్పటికే మూడు దఫాలుగా ప్రభుత్వం చర్చలు జరిపినప్పటికీ ప్రభుత్వం పాతపాటే పాడుతుండటంతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసేందుకు అంగన్వాడీలు సిద్ధమయ్యారు. ఈ నెల 17 నాటికి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రత్యేక కార్యాచరణకు దిగుతామని యూనియన్ల నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

మాట మార్చిన ప్రభుత్వం

మాట మార్చను.. మడమ తిప్పను అని చెబుతూనే ముఖ్యమంత్రి జగన్ అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను మరిచారు. ఇదిలా ఉండగానే అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టే పని మానుకోవాలని అధికారులతో చర్చలు సందర్భంగా అంగన్వాడీ సంఘాల నేతలు తేల్చి చెప్పారు. అయితే తాళాలు పగులగొట్టమనే ఆదేశాలు తామివ్వలేదని ప్రభుత్వం మాట మార్చింది. అయితే ప్రభుత్వ ఆదేశాలతో మాత్రం తాళాలు పగులగొట్టే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీనిపై ప్రజల నుంచి సైతం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సూపర్‌వైజర్లపై తీవ్ర ఒత్తిడి

అంగన్వాడీ కేంద్రాల తాళాలను సచివాలయ అధికారులు దగ్గరుండి పగులగొట్టిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొన్నిచోట్ల అంగన్వాడీలు, చిన్నారుల తల్లిదండ్రులు ప్రతిఘటిస్తున్న నేపథ్యంలో అధికారులు వెనుదిరుగుతున్నారు. అయితే ప్రభుత్వం సరికొత్త పంథాకు తెరలేపింది. అంగన్వాడీ కేంద్రాల సూపర్‌వైజర్లతో కేంద్రాలు తెరిపించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో సూపర్‌వైజర్లపై అధికారులు తీవ్రమైన ఒత్తిడి తీసుకొస్తున్నారు.

పారదర్శక ఓటర్ల జాబితాకు అందరి సహకారం అవసరం : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పక్షాల సహకారం అవసరమని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణలో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సిర్రా భరత్(బిఎస్‌పి), పి.ఆదిశేషు (సిపిఎం), ఎస్.బాబూ ప్రసాద్(కాంగ్రెస్), పాలి ప్రసాద్(టిడిపి), కలవకొల్లు సాంబ(వైసిపి) హాజరయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, ఎన్నికల నిర్వహణలో సమస్యలు తలెత్తకూడదనే ప్రధానోద్దేశంతో ప్రతీవారం రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. తప్పుల్లేని ఓటర్ల జాబితా తయారు చేసేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల సహకారం అందించాలన్నారు. ఎన్నికల్లో పోలింగ్ శాతం కనీసం 75 శాతం ఉండాలనే లక్ష్యంతో ఓటర్లను అవగాహన కలిగించే స్వీప్ అవగాహన కార్యక్రమాలను కూడా ముమ్మరం చేస్తున్నామన్నారు. పట్టణ ప్రాంతాల్లో పోలింగ్ స్టేషన్ల వారీగా గత ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతాన్ని సంబంధింత ఇఆర్ఒ, ఎఇఆర్ఒల ద్వారా పరిశీలించి ఎక్కడ తక్కువగా ఉందో గమనించి ఓటింగ్ శాతం వృద్ధిపరిచే ప్రణాళికను తయారు చేస్తామన్నారు. 80 ఏళ్ల వయస్సు పైబడిన, వందేళ్ళు దాటిన, వికలాంగులు, సెక్స్ వర్కర్లు, ట్రాన్స్ జెండర్లు తమ ఓటుహక్కు వినియోగించుకోవడంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామన్నారు. నడవలేని, మంచం మీద ఉన్న ఓటర్లకు సంబంధించి హోం ఓటింగ్ నిర్వహణపై చర్చిస్తున్నామని తెలిపారు. ఓటు వినియోగంలో ఇబ్బందులుంటే వాటిని తొలగించి ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

జిల్లాలో అక్టోబరు 28 నుంచి ఈనెల తొమ్మిదో తేదీ వరకూ ఫారం-6,7,8 ద్వారా లక్షా 26 వేల 681 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటి వరకూ 99,826 పరిష్కరించామన్నారు. మరో 26,836 పరిష్కరించాల్సి ఉందన్నారు. వీటిలో ఫారం-6 కింద 9,072, ఫారం-7లో 13,332, ఫారం-8లో 4,432 పరిష్కరించాల్సి ఉందన్నారు. వీటిని ఈనెల 18వ తేదీలోపు పరిష్కరించాలని ఆదేశించారు. 18 సంవత్సరాలు పూర్తికాని 17 సంవత్సరాలు నిండిన ప్రొస్పెక్ట్ ఓటర్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారని, వాటిని పరిశీలించిన తర్వాత వారి వయస్సు జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబరు మాసాల్లో ఎప్పుడైతే 18 సంవత్సరాలు నిండుతాయో వారిని ఓటరుగా నమోదు చేస్తామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటించే వరకూ ఓటర్ల జాబితాలో తొలగింపులు, మార్పులకు అవకాశం ఉంటుందన్నారు. 2024 జనవరి ఐదో తేదీన తుది ఓటర్ల జాబితా ప్రకటించినప్పటికీ ఎన్నికల నామినేషన్ తేదీ వరకు ఓటర్లుగా నమోదు చేసుకునే అవకాశం ఉందని, వీటిని సప్లిమెంట్ ఓటర్ల జాబితా కింద ప్రకటిస్తామన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తయ్యేవరకూ ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని రాజకీయపార్టీల ప్రతినిధులను కలెక్టర్ కోరారు.

ఎంఎల్‌సి సాబ్జీ అకాలమృతి బాధాకరం

తొలుత ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అకాల మృతికి సమావేశం సంతాపం తెలిపింది. కలెక్టర్ మాట్లాడుతూ సాబ్జీ మృతి బాధాకరమన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సాబ్జీ మృతి ప్రజాఉద్యమాలకు తీరనిలోటు

జిల్లావ్యాప్తంగా సంతాప సభలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికనేత ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మృతికి సిపిఎం జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. ఈ సందర్భంగా స్థానిక పవర్‌పేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం సాబ్జీ సంతాప పార్టీ నాయకులు పి.కిషోర్ అధ్యక్షతన జరిగింది. ముందుగా సాబ్జీ చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు బి.సోమయ్య, గుడిపాటి నరసింహారావు పూలమాల వేసి నివాళు లర్పించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మంగరాజు సాబ్జీ జీవితాన్ని, ఆయన ఉద్యమాల్లో చేసిన కృషిని, ఆయన లేని లోటుని వివరిస్తూ పాట పాడారు. ఈ సందర్భంగా సంతాపసభకు విచ్చేసిన సభ్యులు కంటతడి పెట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ సాబ్జీ ఉద్యమబాటలో నడుస్తూ తన తుదిశ్వాస వదలడం అందరి హృదయాలను కలచివేసిందన్నారు. ఆయన చివరి క్షణాల్లోనూ కైకలూరు, ఆకివీడులో అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మెకు మద్దతు ప్రకటించి వారికి ధైర్యాన్నిచ్చారన్నారు. చివరివరకూ సమాజం కోసం వెచ్చించారని, ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేశారన్నారు. పోరాటమే ఊపిరిగా పనిచేశారని కొనియాడారు. ఆయన గెలిచింది ఉపాధ్యాయ ఎన్నికల్లో ఎంఎల్‌సిగానే అయినా కేవలం ఉపాధ్యాయ సమస్యలపైనే కాకుండా రైతుల, వ్యవసాయ కార్మికుల, కార్మికుల, చేతివృత్తిదారుల, ఉద్యోగుల సమస్యలపై నిరంతరపోరాటం చేశారన్నారు. శాసనమండలిలో వారిసమస్యలపై ఉద్యమించారన్నారన్నారు. ఆయన మరణంతో ఉభయగోదావరి జిల్లాలో పెద్దదిక్కుని కోల్పోయామని ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనమిచ్చే నివాళులని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయరంగాల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేశారన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు, బి.సోమయ్య మాట్లాడుతూ అందరి కోసం పని చేసిన మనిషిగా ఆయన జీవితం సాగిందన్నారు. కేవలం కార్మిక, ఉద్యోగ, ఉ పాధ్యాయ రంగాలకే కాకుండా ఎవిఆర్ విజ్ఞాన కేంద్రంగా నిర్వహించే అనేక కార్యక్రమాలకు అండగా నిలచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, మహిళా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హైమావతి, ఎ.శ్యామలారాణి, సిపిఎం నాయకులు వి.సాయిబాబు, వి.జగన్నాధరావు, మావూరి శ్రీనివాస్, బుస్నాక్ కోటేశ్వరరావు, ఎం.సత్యం పాల్గొన్నారు.

ప్రముఖుల సంతాపం

సాబ్జీ మృతికి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఉన్న ఆయన సాబ్జీ కుటుంబ సభ్యులకుప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఎపి రైతు, కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీలు సంతాపం తెలిపాయి. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిమ్మగడ్డ నరసింహ, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, కౌలు రైతుల సంఘం జిల్లా కన్వీనర్ కె.అప్పారావు సంతాపం తెలిపినవారిలో ఉన్నారు.సాబ్జీ అకాల మరణం ప్రజాఉద్యమాలకు తీరనిలోటని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ అన్నారు. సంఘం జిల్లా కమిటీ తరపున ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు.ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు(యువి) తీవ్ర సంతాపం తెలిపారు. ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన సాధన సమితి నాయకులు దుర్గాప్రసాద్, ఠాగూర్ సంతాపం తెలిపారు. అలాగే సాబ్జీ మృతికి మానవత అధ్యక్షులు మేతర అజయ్‌బాబు సంతాపం తెలిపారు. సాబ్జీ మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెఎసి ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్, కన్వీనర్ నెరుసు వెంకట రామారావు అన్నారు. ఆయన మృతి ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గానికి తీరని లోటు అని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. సాబ్జీ మృతి బాధాకరమని విఆర్‌ఒల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు అన్నారు. సాబ్జీ మృతికి ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ సంతాపం తెలిపారు. ఈ ఘటన బాధాకరమని ఆమె అన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.సాబ్జీ మృతికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ సంతాపం తెలిపారు. సాబ్జీ మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని బహుజన టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బి.మనోజ్ కుమార్, జిల్లా అధ్యక్షులు గుడిమెల్లి వెంకటేశ్వరావు అన్నారు. ఆయన మృతికి వారు సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు సానుభూతిని ప్రకటించారు. సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్, పార్టీ సీనియర్ నాయకులు బి.సోమయ్య సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

సాబ్జీ మృతికి హిందూ యువజన సంఘం (వైఎంహెచ్ఎ) సభ్యులు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక వైఎంహెచ్ఎ హాలులో సాబ్జీ మృతికి సతాపం తెలిపి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో


ఏలూరులో సంతాపం తెలుపుతున్న నేతలు

కమిటీ అధ్యక్షులు యర్రా సోమలింగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కెవి.సత్యనారాయణ, కార్యనిర్వాహక కమిటీ ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, మేనేజ్‌మెంట్ కమిటీ ఉపాధ్యక్షులు ఇరదల ముద్దుకృష్ణ, సహాయ కార్యదర్శి వేమా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సాబ్జీ మృతి జీర్ణించుకోలేనిదని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రంలో జరిగిన సంతాప సభలో వక్తలు అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, నాయకులు ఆలపాటి నాగేశ్వరరావు, అడుసుమిల్లి నిర్మల, ఎన్ఎస్‌వి.రామకృష్ణారావు, హైమావతి, గోద్రేజ్ ఆగ్రో అడ్వయిజర్ కుమార్ రిటైర్డ్ ఉద్యోగులు వై.ఆనంద నాయుడు, కె.సత్యనారాయణ, హరినారాయణ, ఆంజనేయులు, కస్తూరి రావు, విజ్ఞాన కేంద్రం వివిధ సంఘాల సభ్యులు రామకృష్ణారావు, మేతర అజయ్‌బాబు, దోమణిక్, అర్జున్‌రావు, రత్నాకర్‌రావు, సోమ్లా నాయక్, పి.హైమావతి, దుర్గాప్రసాద్, రావి పద్మ, ఎ.మోహిని కనకదుర్గ, లక్ష్మి, కోహిమా, శ్రీనివాస్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలవరం : ఎంఎల్‌సి సాబ్జీ అకాల మృతికి సిపిఎం మండల కమిటీ సంతాపం తెలిపింది. పార్టీ మండల కార్యదర్శి గుడేల్లి వెంకట్రావు మాట్లాడుతూ సాబ్జీ మృతి తీరనిలోటన్నారు. సంతాపం తెలిపిన వారిలో నాయకులు బి.భూచంద్రరావు, సముద్రాల సాయి కృష్ణ, మడివి చలపతి, పాప, బాలరాజు, మీడియం గంగాదేవి పాల్గొన్నారు

భీమడోలు : ధన్యజీవి సాబ్జీ అని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అన్నారు. సాబ్జీ మృతికి మండలంలోని వివిధ ప్రాంతాల్లో శనివారం సంతాప సభలు నిర్వహించారు. గుండుగొలనులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శాసనసభ్యులు రద్దు చేశారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిడిఒ పద్మావతిదేవి ఆధ్వర్యంలో ఐకెపి, పంచాయతీరాజ్ అధికారులు, సిబ్బంది సంతాప సభ నిర్వహించారు. రైతుసంఘం జిల్లా నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావుతో కలిసి సాబ్జీకి నివాళులర్పించారు. మండల వనరుల కేంద్రం వద్ద ఉపాధ్యాయులు, ఎంఇఒ భాస్కర్ ఆధ్వర్యంలో సాబ్జీ సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు బాల భాస్కర్, పిఆర్‌టియు నాయకులు శరీన్ పాల్గొన్నారు.

చింతలపూడి : సాబ్జీ సేవలు మరువలేనివని ఎంపిడిఒ మురళీకృష్ణ అన్నారు. ఎంపిడిఒ కార్యాలయం వద్ద చింతలపూడి ప్రెస్ క్లబ్ అధ్వర్యంలో సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యూజెఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఆజాద్, అమిర్, రాజు, వీరయ్య, సూరిబాబు పాల్గొన్నారు.

ఉంగుటూరు : సాబ్జీ మృతికి యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంబాబు, జోగినాయుడు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో గౌరవ అధ్యక్షులు శీతాల సత్యనారాయణ, హైస్కూల్ హెచ్ఎం మీరాసాహెబ్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఉప్పిలి వెంకటేశ్వరరావు, శ్రీరామకృష్ణ, యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ద్వారకాతిరుమల : సాబ్జీ మృతికి మండల యుటిఎఫ్ నేతలు స్థానిక ఎంఇఒ కార్యాలయం వద్ద సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో నాయకులు కట్టా శ్రీనివాసరావు, గెడ్డం దేవానందరావు, బి.జయరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: సాబ్జీ మృతి పార్టీకి, ఉపాధ్యాయ సంఘాలకు తీరనిలోటని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు అన్నారు. మృతికి సంతాపంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చాకిరి శివనాగరాజు, సభ్యులు సత్తు కోటేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతలపూడి : స్థానిక ప్రభుత్వ పాఠశాలలో జరిగిన సంతాప సభలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చక్రధరరావు, యూటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పూరేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు. సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సమన్వయంతో పనిచేయాలి : ఎంపిడిఒ

భీమడోలు : గ్రామాల అభివృద్ధికి, గ్రామ పంచాయతీ స్థాయిలో సమర్థవంతమైన పాలనతో పాటు ప్రజలకు మరింతగా సేవ చేసేందుకు పంచాయతీ పాలకవర్గం, అధికారులు పరస్పరం సహకరించుకుని సమన్వయంతో పని చేయాలని భీమడోలు ఎంపిడిఒ సిహెచ్.పద్మావతి దేవి కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం గ్రామపంచాయతీ సాధారణ పరిపాలన, ఆర్థిక వ్యవహారాల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బందికి ఒకరోజు పాటు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న భీమడోలు ఎంపిడిఒ గ్రామపంచాయతీ పరిపాలన విధానంపై, 36 అంశాలపై అవగాహన కల్పించారు. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. పంచాయతీ పరిపాలన విధానంపై సిద్ధం చేసిన బుక్ లెట్లను అధికారులకు అందజేశారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఎంఎల్‌సి షేక్ సాబ్జీకి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ విస్తరణాధికారి సుందరి పాల్గొన్నారు.

ముదినేపల్లి : జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు శనివారం మండలంలోని పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గ్రామపంచాయతీ పరిపాలనా విధానంపై, పంచాయతీ సాధారణ పరిపాలన విధానం గురించి ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం మండలంలోని పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ (1-6)లకు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిడిఒ పి.మల్లేశ్వరి ప్రారంభించారు. ఈ శిక్షణా సమావేశంలో పరిపాలనాధికారి రమణబాబు పాల్గొన్నారు.

పంట నమోదు పూర్తి : ఎడి

భీమడోలు : మండల పరిధిలో పంట నష్టం నమోదు సర్వే కార్యక్రమం పూర్తయిందని వ్యవసాయ అధికారి ఉషారాణి తెలిపారు. ప్రాథమిక అంచనాల మేరకు 1200 ఎకరాల విస్తీర్ణంలో పంట దెబ్బతిన్నట్లు గుర్తించారు. ఆ తరువాత గ్రామపంచాయతీ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, సచివాలయ, వ్యవసాయ సహాయకులు సభ్యులుగా గల కమిటీ పంట నష్టం నమోదుకు నిర్ణయించిన నిబంధనల మేరకు సర్వే నిర్వహించగా, మండల పరిధిలో 312 మంది రైతులకు చెందిన 520 ఎకరాల విస్తీర్ణంలో పంట నష్టపోయినట్లు లెక్క కట్టారు. వీటి వివరాలను రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శన కోసం ఉంచామన్నారు. దీనిపై రైతులు తమ అభ్యంతరాలను ఈనెల 22వ తేదీలోగా రైతు భరోసా కేంద్రాలకు తెలియజేయాలని కోరారు. ఆ మేరకు మరొకమారు సర్వే నిర్వహిస్తామన్నారు.

నిర్లక్ష్యంగా నిర్వహిస్తే కఠిన చర్యలు

మండవల్లి : ప్రమాదాలు జరిగేలా రహదారి అభివృద్ధి పనులు నిర్లక్ష్యంగా నిర్వహిస్తే సహించేది లేదని, చర్యలు తీసుకుంటానని ఎన్‌హెచ్ డి.సత్యనారాయణ కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. జాతీయ రహదారి మండవల్లి ప్రధాన సెంటర్ నుంచి రైల్వే స్టేషన్ వరకు అభివృద్ధి పనుల్లో భాగంగా నెలకొన్న సమస్యలను ఆయన శనివారం పరిశీలించి బాధితులతో మాట్లాడారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద జాతీయ రహదారి ఇరుపక్కల మూసుకుపోయి, ప్రమాదాలు జరిగే పరిస్థితిని పరిశీలించారు. వెంటనే పనులు ప్రారంభించి, వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన కాంట్రాక్టరుకు సూచించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఒ కమలహాసన్, బాధితులు, కాంట్రాక్టు సిబ్బంది పాల్గొన్నారు.

గోపన్నపాలెంలో ‘ఆడుదాం ఆంధ్ర’

ఏలూరు టౌన్ : ఆడుదాం ఆంధ్ర ట్రైల్ రన్‌లో భాగంగా గోపన్నపాలెం సచివాలయ పరిధిలో ఉన్న సచివాలయం-2లో టీం వన్, టీం టు గేమ్స్ శనివారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నతానియెల్, డిస్టిక్ స్పోర్ట్స్ అథారిటీ శ్రీనివాసరావు, దెందులూరు మండల కోఆర్డినేటర్ సురేష్, వ్యాయామ ఉపాధ్యాయులు జి.శ్రీనివాసరావు, పోతునూరు హైస్కూల్ పిడి ఎం.కృష్ణారావు, మేదండ్రు పాలెం పీడీ రవిబాబు, జిల్లా పరిషత్ హైస్కూల్ దెందులూరు పీడీ ఎన్.రాధా, చల్ల చింతలపూడి పీడీ, పిఇటి టి.రాజేష్, గవర్నమెంట్ హైస్కూల్ గోపన్నపాలెం పిఇటి వివి.పార్థసారథి, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ రమేష్, గోపన్నపాలెం సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతో లాభాలు

నూజివీడు రూరల్ : సరైన సమయంలో మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా పండ్ల తోటల్లో లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎస్.రామ్మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో పండ్ల తోటల పెంపకం కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఒ ఆర్.హేమ, పవర్ సోలార్ ప్రతినిధి శైలజ పాల్గొన్నారు.

ఇంధన పొదుపు వారోత్సవాల ర్యాలీ

నూజివీడు రూరల్ : పట్టణంలో శనివారం విద్యుత్ ఉద్యోగులు ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ ఇఇ కార్యాలయం నుంచి చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఇంధన పొదుపుపై నినాదాలు చేశారు. ప్రతిఒక్కరూ ఫైవ్‌స్టార్ రేటింగ్ ఉన్న విద్యుత్ పరికరాలను ఉపయోగించాలన్నారు. ఈ సందర్భంగా ఇఇ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్‌ను పొదుపు చేయడం అందరి బాధ్యతగా గుర్తించాలన్నారు. ఉపకరణాల వినియోగం అనంతరం స్విచ్ ఆఫ్ చేయడం ద్వారా పొదుపు చేయడం ద్వారా భావితరాలకు విద్యుత్‌ను అందించిన వారమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

‘భూ సమస్య పరిష్కరించకుంటే ఐటిడిఎను ముట్టడిస్తాం’

బుట్టాయగూడెం : ఎల్‌టిఆర్ 1/70 చట్టం భూ సమస్యను ఇప్పటికైనా ఐటిడిఎ అధికారులు సత్వరమే పరిష్కరించాలని లేని పక్షంలో ఐటిడిఎ ముట్టడి కార్యక్రమం చేపడతామని సిపిఎం మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆరు రోజులుగా జరుగుతున్న దీక్షకు ఐటిడిఎ అధికారులు చలనం లేకుండా వ్యవహరిస్తున్నారని, కనీసం దీక్ష శిబిరానికి వచ్చి సమస్య పరిష్కారం చేసే విధానం హామీ ఇవ్వాలని, లేని పక్షంలో మండల వ్యాప్తంగా ఉన్న గిరిజనులందరినీ సమీకరించి ఐటిడిఎ వద్ద వంటావార్పు ముట్టడి కార్యక్రమం కూడా చేపడతామని హెచ్చరించారు. సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ ఇప్పటికైనా భూ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా అధికారులు ప్రయత్నాలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మరల గూడెం గ్రామస్తులు దుర్గారావు, వెంకటేశ్వరరావు, పుల్లారావు, శ్రీదేవి పాల్గొన్నారు.

విద్యాదాత మూర్తిరాజు సేవలు ఆదర్శనీయం

ఉంగుటూరు : నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యాదాత, కళాశాల వ్యవస్థాపకులు చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు 104వ జయంతి నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పొలిటికల్ సైన్స్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విశ్వేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్, ముఖ్య అతిథి ఆరెడ్డి సత్యనారాయణ, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు మూర్తిరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విశ్రాంత పీడీ ఆరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రజల విద్యా అవసరాలు తీర్చడానికి మన కళాశాలకు 5.77 ఎకరాల్లో భూమిని దానంగా ఇచ్చారని వివరించారు.

పంట నష్టం అంచనాలు సిద్ధం

ముదినేపల్లి : తుపాను వల్ల మండలంలో దెబ్బతిన్న గ్రామాల్లో పంట నష్టం అంచనాలు సిద్ధం చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బొర్రా వేణుమాధవ్ శనివారం తెలిపారు. మండల తహశీల్దారు ఆదేశాలతో గ్రామస్థాయిలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారి, పంచాయతీ సెక్రటరీతో కూడిన కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీలు వారి వారి గ్రామ పరిధిలో విస్తృతంగా పర్యటిస్తూ పంట నష్టం అంచనాలను తయారు చేస్తున్నట్లు తెలిపారు.

షష్టి వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ముదినేపల్లి : మండలంలోని సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరగనున్న షష్టి కళ్యాణ మహోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు శనివారం ఆవిష్కరించారు. ఈనెల 17వ తేదీ నుంచి షష్టి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆలయ ఇఒ సంధ్య, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు కైకలూరులోని డిఎన్ఆర్‌ను ఆయన స్వగృహంలో కలిసి వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సహాయమాత స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుక

ముదినేపల్లి : ముదినేపల్లిలోని సహాయమాత ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో శనివారం సెమీ క్రిస్మస్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం విద్యార్థులచే కిస్మస్ గీతాలు, క్రీస్తు జననం నాటికను ప్రదర్శింప చేశారు. ఈ వేడుకను చూసేందుకు పెద్ద ఎత్తున స్థానికులు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సిస్టర్ క్రిష్టి, స్కూల్ ప్రిన్సిపల్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

‘సమ్మెను విరమించేదే లేదు’

తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారం ఐదోరోజుకు చేరుకుంది. పలుచోట్ల అంగన్‌వాడీలు నోటికి నల్ల మాస్కు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తాళాలు పగలగొట్టి దౌర్జన్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ర్యాలీగా పోలీసు స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. చింతలపూడిలో అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగలగొడితే ఒంటికి పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంటానని అంగన్‌వాడీ జిల్లా అధ్యక్షులు సరోజిని హెచ్చరించారు. లబ్ధిదారుల తల్లులు చంటిబిడ్డలతో శిబిరానికి చేరుకుని మద్దతు తెలిపారు. సమ్మె శిబిరంలో ఎంఎల్‌సి సాబ్జి మృతికి నివాళులర్పించారు.

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మెను విరమించేదే లేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు హెచ్చరించారు. ఆగిరిపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద కొనసాగుతున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నిరవధిక సమ్మెలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నాగరాజు, కోటేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నమ్మ, అనూరాధ, పుట్లమ్మ, రూప, కరుణ, జ్యోతి పాల్గొన్నారు.

ఉంగుటూరు: నిన్న రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన ఎంఎల్‌సి షేక్ సాబ్జీ చిత్రపటానికి అంగన్‌వాడీ కార్యకర్తలు, సిఐటియు, వివిధ కార్మిక సంఘాల నాయకులు శనివారం ఉంగుటూరులో నివాళులర్పించారు. అంగన్‌వాడీల సమ్మె శిబిరం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు సాబ్జి చేసిన పోరాట ఉద్యమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: అంగన్‌వాడీల సమ్మె ఐదోరోజు కొనసాగింది. ఈ సమ్మెలో అంగన్‌వాడీలు, సిఐటియు నాయకులు ఎంఎల్‌సి సాబ్జి మృతికి సంతాపం తెలియజేశారు. సాబ్జి చిత్రపటానికి అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు శివరత్న కుమారి, జె.నాగమణి పూలదండ వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు మాట్లాడుతూ ఉద్యోగ కార్మికుల సమస్యలు రాజ్యసభలో వివరించే గొంతు మూగబోయిందని, ఆయన హఠాత్ మరణం తీవ్ర లోటు కలిగిందని పేర్కొన్నారు. ఐదవ రోజు నల్లరిబ్బను మూతికి కట్టుకుని నిరసన తెలియజేశారు. తాళాలు బద్దలు కొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, ఎం.మాధవి, జ్యోతి, చిట్టితల్లి, పద్మజ పాల్గొన్నారు.

చాట్రాయి : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ప్రారంభించిన నిరవధిక సమ్మె ఐదో రోజుకు చేరుకుంది. శనివారం శిబిరంలో కూర్చుని నోటికి నల్ల మాస్కులు ధరించి నిరసన తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలకు వేసి ఉన్న తాళాలను పగలగొట్టిన ప్రభుత్వ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బందిపై స్థానిక చాట్రాయి పోలీస్ స్టేషన్‌లో అంగన్‌వాడీలు, హెల్పర్లు ర్యాలీగా వెళ్లి ఎస్ఐ కెసిహెచ్.స్వామికి ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమానికి అంగన్‌వాడీ కార్యకర్తలు విజయ, నిర్మల జ్యోతి నాయకత్వం వహించారు.

జీలుగుమిల్లి: మండలంలోని అంగన్‌వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె ఐదోరోజు శనివారం మూతికి గంతలు కట్టుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అనంతరం ఎంఎల్‌సి షేక్ సాబ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొన్ని చోట్ల బలవంతంగా అంగన్‌వాడీ కేంద్రాలను మండల అధికారులు, సచివాలయ సిబ్బందితో కలిసి తాళాలు పగలకొట్టే చర్యలకు పాల్పడటం సిగ్గు చేటని సిపిఎం నాయకులు విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు అప్పారావు, సిఐటియు మండల కార్యదర్శి కొండలరావు, నాగమణి, ఎస్తేరు పాల్గొన్నారు.

కలిదిండి : పోలీసులకు ఫిర్యాదు చేస్తూ..

ఏలూరు అర్బన్ : అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా ఐదోరోజు శనివారం ప్రభుత్వం మాకు జీతాలు పెంచకపోతే, ఆకలి బాధలతో గడ్డి తినాల్సి వస్తుందని కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు వినూత్నంగా నిరసన కార్యక్రమం చేశారు. ముందుగా శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎంఎల్‌సి షేక్ సాబ్జి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సమ్మె శిబిరాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి సందర్శించి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె పరిష్కరించకపోతే వైసిపి ఇంటికి పోవడం ఖాయమని ఆయన హెచ్చరించారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ఎంఎల్‌సి షేక్ సాబ్జి ఎంతో కృషి చేశారని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆలీ, కార్యదర్శి ఆర్.రవికుమార్, కోశాధికారి రంగమోహన్, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే, బండి వెంకటేశ్వరరావు, సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాథం, కార్యదర్శి వి.సాయిబాబా, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు భవాని, అరుణ కుమారి, ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.హైమావతి, ఎ.శ్యామల రాణి పాల్గొన్నారు.

నిడమర్రు: అంగన్‌వాడీల సమ్మెకు టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంఎల్ఎ గన్ని వీరాంజనేయులు మద్దతు తెలిపారు. ముందుగా ప్రమాదంలో మృతి చెందిన ఎంఎల్‌సి సాబ్జి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సమ్మెను ఉద్దేశించి మాట్లాడుతూ మీరు చేస్తున్న సమ్మె న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం మా పార్టీ యావత్తు కృషి చేస్తుందని, పూర్తి అండగా సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ముత్యాల స్వామి పాల్గొన్నారు.

మండవల్లి : అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ధర్నా ఐదోరోజుకు చేరుకుంది. శనివారం అంగన్‌వాడీలు నల్ల దుస్తులు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అంగన్‌వాడీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు చెల్లాయమ్మ, ఉమాదేవి, విజయలక్ష్మి, కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.

నిడమర్రు: ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలని నిడమర్రు పోలీస్ స్టేషన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్స్ ధర్నా చేశారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ ఐదు రోజులుగా శాంతియుతంగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే, అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టి ప్రభుత్వ ఫైళ్లను, ఇతర సామాగ్రిని దొంగిలించారని, చట్టరీత్యా ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికార యంత్రాంగమే గ్రామంలో వైసిపి నాయకులు, వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులతో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయిస్తున్నారని వారిపై తగు చర్యలు తీసుకొని, క్రిమినల్ కేసులు పెట్టాలని పోలీసు వారిని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోన జయమ్మ, ఎ.నాగమణి పాల్గొన్నారు.

ద్వారకా తిరుమల: అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించకపోతే జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని గోపాలపురం నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వర రావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ హెచ్చరించారు. మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన ఐదవ రోజు సమ్మెలో వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వం సెంటర్ల తాళాలు, తలుపులు బద్దలు కొడుతూ చట్టాన్ని ఉల్లంఘిస్తోందని విమర్శించారు. మాట తప్పి, మడమ తిప్పిన నేతగా జగన్మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారన్నారు. అనంతరం ఎంఎల్‌సి షేక్ సాబ్జి మృతికి అంగన్‌వాడీలు, నాయకులు సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయుకులు ఇమ్మడి రత్నాజీ, ఘంటా బాబ్జి, వాసిరెడ్డి ప్రవీణ్, రామకృష్ణ పాల్గొన్నారు.

పోలవరం : ఐదోరోజుకు చేరుకున్న అంగన్‌వాడీల సమ్మెలో పోలవరం అంగన్‌వాడీ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఎంఎల్‌సి షేక్ సాబ్జి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నల్ల రిబ్బన్లు కళ్లకు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మాట్లాడుతూ ఎంఎల్‌సి సాబ్జి పోలవరం మండలంలో జన్మించి, ఉపాధ్యాయ రంగంలో ఎనలేని కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పిఎల్ఎస్.కుమారి పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలకేంద్రమైన టి.నరసాపురంలో అంగన్‌వాడీ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మెలో ఐదోరోజు అంగన్‌వాడీలు మూతికి నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన తెలియజేశారు. ముందుగా ఎంఎల్‌సి సాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీరి సమ్మెకు జనసేన మండల కన్వీనర్ అడపా నాగరాజు వారి బృందం, టిడిపి నాయకులు, రైతుసంఘం మండల నాయకులు అనుమోలు మురళీ సంఘీభావం తెలిపారు.

బుట్టాయగూడెం : ఐదోరోజుకు చేరుకున్న అంగన్‌వాడీల సమ్మెలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం.నాగమణి, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు గ్రాడ్యుటీ, వేతనాలు, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ సత్వర్యమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు మద్దతుగా జనసేన మండల అధ్యక్షులు రవి ప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు మద్దిపాటి శ్రీనివాస్, సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎంఎల్‌సి షేక్ సాబ్జికి సంతాపం ప్రకటించి, అంగన్‌వాడీలు, ప్రజా సంఘాలు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు విఎస్.కృపారాణి, కె.పుష్ప, టి.రామలక్ష్మి పాల్గొన్నారు.

కైకలూరు : అంగన్‌వాడీల సమ్మె ఐదోరోజులో భాగంగా కైకలూరు తాలూకా సెంటర్లలో ఆందోళన కొనసాగించారు. శనివారం ఉదయం ఆటపాక, ఆలపాడు, కైకలూరు సెక్టార్ల అంగన్‌వాడీ సిబ్బంది నిరసన దీక్షలు చేపట్టారు. శిబిరం వద్ద ఎంఎల్‌సి సాబ్జి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు పోలవరపు సుజాత, విజిత, మీనాక్షి కుమారి పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఐదవ రోజుకు చేరింది. అంగన్‌వాడీ సంఘం నాయకులు షేక్ అబిదా బేగం, జక్కంశెట్టి మేనక లక్ష్మి, కొప్పినీడి రమాదేవి పాల్గొన్నారు. సిపిఎం నాయకులు వీరవల్లి భాస్కరరావు, టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు, వెంకటాపురం సర్పంచి గూడవల్లి శ్రీనివాసరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు కెవిఎస్ రామకృష్ణ, గంగుల గణపతులు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఎంఎల్‌సి సాబ్జీ అకాల మరణం పట్ల సమ్మె శిబిరంలో అంగన్‌వాడీలు సంస్మరణ సభ నిర్వహించారు. సాబ్జీ చివరి శ్వాస వరకు ఉద్యోగ, కార్మికుల సమస్యలపై పోరాడారని సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు బద్దలు కొట్టిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఏలూరు అర్బన్ : సాబ్జీకి నివాళులర్పిస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం : గత ఐదు రోజులుగా అంగన్‌వాడీ వర్కర్లు సమ్మె చేస్తుంటే దుర్మార్గంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ అన్నారు. శనివారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద దీక్ష చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లకు మద్దతుగా దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్లకు టిడిపి పూర్తి మద్దతుగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్రశేషు, ఆకుమర్తి రామారావు, బొమ్మాజీ అనిల్ పాల్గొన్నారు.

భీమడోలు : అంగన్‌వాడీలు తమ సమ్మె ఐదోరోజుకు చేరుకున్న సందర్భంగా నోటికి నల్ల రిబ్బన్లను కట్టుకొని నిరసన కార్యక్రమం కొనసాగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజుతో పాటు రైతు సంఘం జిల్లా నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు సాబ్జీకి నివాళులు సమర్పించారు.

ముసునూరు : ముసునూరు గ్రామ సచివాలయంలో అంగన్‌వాడీలు ఐదోరోజు కళ్లకు గంతలు కట్టుకుని నినిరసన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత లేకుండా రాష్ట్ర ప్రభుత్వం పని చేయిస్తుందని సిపిఎం జిల్లా నాయకులు జి.రాజు అన్నారు. టిడిపి మండల నాయకులు కందుల పిచ్చియ్య, మెదరమెట్ల సురేంద్ర సంఘీభావం తెలియజేశారు. అనంతరం అంగన్‌వాడీలు పల్లిపాము రాజకుమారి, విద్యావతి, విజయలక్ష్మి, లక్ష్మిల ఆధ్వర్యంలో ముసునూరు పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి ఎస్ఐ ఎం.కుటంబరావుకు వినతని అందజేశారు.

ముదినేపల్లి: తమ సమస్యలు పరిష్కరించాలంటూ ముదినేపల్లిలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న దీక్షలు శనివారంతో ఐదవ రోజు చేరాయి. ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించే వరకు తమ పోరాటం ఆపేది లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. కనీస వేతనం అములు చేయాలని డిమాండ్ చేశారు.

చింతలపూడి సమ్మె శిబిరం వద్ద పిల్లలతో లబ్ధిదారులు

చంటిబిడ్డలతో తరలొచ్చి సమ్మెకు మద్దతు

చింతలపూడి : ఐదవ రోజు అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా శనివారం మండలం కేంద్రంలో సమ్మె శిబిరం వద్దకు లబ్ధిదారుల తమ చంటి బిడ్డలతో పెద్ద ఎత్తున తరలివచ్చి అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలియజేశారు. జగనన్నకు చెప్పండి.. అంగన్‌వాడీ తల్లుల సమస్యలు తీర్చమని, మాకు అంగన్‌వాడీ తల్లులు కావాలి అనే నినాదాలతో ప్లేకార్డులు ప్రదర్శన చేశారు. అనంతరం కీర్తిశేషులు సిఎం వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి మెమో రాండం ఇచ్చారు. అనంతరం ప్రదర్శనగా చింతలపూడి పోలీస్ స్టేషన్‌కి వెళ్లి అంగన్‌వాడీ సెంటర్ తాళాలు గుర్తు తెలియని వ్యక్తులు బద్దలు కొడుతున్నారని, సెంటర్లలో స్టాకులు, రికార్డులు చెల్లా చెదురు చేస్తున్నారని ఎఎస్ఐకు సంతకాలతో కూడిన రిపోర్టును అందజేశారు. అంగన్‌వాడీలకు కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది.

‘తాళాలు పగలగొడితే పెట్రోలు పోసుకుంటా’

చింతలపూడి మండలం ఫాతిమాపురం గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్ తాళాలు పగలకొట్టడానికి వెళ్లగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు సరోజిని తాళాలు పగలగొడితే పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకుంటానని హెచ్చ రించారు. దీంతో సిబ్బంది వెనక్కి వెళ్లారు. అదేవిధంగా చింతలపూడి గాంధీనగర్ సెంటర్‌లో తాళాలు పగలగొడుతుంటే టిడిపి నాయకులు అడ్డుకున్నారు.

పోలీసులను హెచ్చరిస్తున్న సరోజిని

వైద్యం అందించడంలో నిర్లక్ష్యం!

డాక్టర్ అనిలాపై ఫిర్యాదు : ఫిర్యాదుదారుడికి బెదిరింపులు

ప్రజాశక్తి - మండవల్లి

పేదలకు వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కాకుండా ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని వైద్య సిబ్బంది బెదిరింపులకు పాల్పడ్డారు. విధులను ఎగ్గొట్టి ఫిర్యాదుదారుడి నివాసానికి వెళ్లి ఫిర్యాదులు వెనక్కి తీసుకోవాలని బాధితునిపై ఒత్తిడి తెచ్చారు. దీంతో ఆగ్రహించిన బాధితుడు కంప్లైంట్ వెనక్కి తీసుకునేది లేదని అవసరమైతే మరో కంప్లైంట్ ఇస్తానని సూటిగా సమాధానం ఇచ్చిన సంఘటన మండల కేంద్రమైన మండవల్లిలో శనివారం చోటు చేసుకుంది. బాధితుడు బండి రంగారావు తెలిపిన వివరాల ప్రకారం మండవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేదలకు వైద్య సేవలు అందడం లేదన్నారు. డాక్టర్ అనిలా వైద్యశాలలో ఉండరని, ఎక్కడికి వెళతారో కూడా తెలియదని అన్నారు. సిబ్బంది చేతికొచ్చిన బిళ్లలను ఇచ్చి పంపిస్తారని, ఆ బిళ్లలు ఎలా వేసుకోవాలో కూడా చెప్పరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అయితే గత కొన్ని రోజుల కిందట అనారోగ్యం బారిన పడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లడం జరిగిందని, అప్పటికే రోగులు ఎక్కువమంది వైద్య నిమిత్తం వైద్యశాలకు వచ్చారని, ఇద్దరు వైద్యులు వైద్యశాలలో లేరని అన్నారు. దీనిపై సిబ్బందిని ప్రశ్నించగా ఎక్కడికి వెళ్లారో తెలియదని చెప్పడంతో సూపర్వైజర్‌ని ప్రశ్నించానన్నారు. రోగులు పడుతున్న ఇబ్బందిని చూసి సహించలేక వెంటనే సిఎంఒ కార్యాలయానికి ఫిర్యాదు చేశానని తెలిపారు. డాక్టర్ అనిలాపై గతంలో కూడా చాలాసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. అంతేకాకుండా డాక్టర్ అనిలాకు పేదలంటే చులకన భావం ఎక్కువని విమర్శించారు. రోగులు పడుతున్న ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని పేదలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సిఎంఒ కార్యాలయానికి ఫిర్యాదు చేశాననే ఆక్రోషంతో డాక్టర్ అనిలా ఫిర్యాదు వెనక్కి తీసుకోవాలని వైద్య సిబ్బందితో బెదిరించడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు స్పందించి డాక్టర్ అనిలాపై చర్యలు తీసుకుని, బెదిరింపులకు పాల్పడిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, పేద ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సకాలంలో వైద్య సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. దీనిపై జిల్లా వైద్యశాఖ అధికారులను వివరణ కోరడానికి ఫోన్‌లో ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

గ్రామాలు అభివృద్ధి చేయాలి : ఎంపిపి

ప్రజాశక్తి - ముసునూరు

గ్రామ సచివాలయాలు గ్రామ పరిపాలనకు పట్టుకొమ్మలాంటివని ఆనాడు గాంధీజీ పేర్కొన్నట్లు గ్రామాలు అభివృద్ధి చేయాలని పంచాయతీ, సచివాలయ సిబ్బందికు మండల ఎంపిపి కొండా దుర్గ భవానీ వెంకట్రావు సూచించారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ జి.రాణి ఆధ్వర్యంలో పంచాయతీ, గ్రామ సచివాలయాలపై ఆర్థిక వ్యవహారాల ప్రణాళిక, బడ్జెట్ వివరాలపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ జి.రాణి మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ, గ్రామ సర్పంచులతో మమేకమై గ్రామ ప్రజలకు సుపరిపాలన అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, ఎంపిడిఒ ఆఫీస్ ఎఒ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి - కైకలూరు

సహకార కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో చైర్మన్, సిఇఒ ఆదేశానుసారంగా నాబార్డ్ సౌజన్యంతో డిజిటల్ ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో గ్రామీణ, పట్టణ ప్రజలకు సహకార కేంద్ర బ్యాంక్ అందిస్తున్న వివిధ రకాల రుణ సౌకర్యాలు, ప్రతి ఒక్కరు కూడా పొదుపు ఖాతా తెరవాలని, పొదుపు ఖాతా కలిగి ఉండడం వలన అనేక లాభాలు పొందవచ్చని వివరించారు. బీమా వల్ల కలిగే లాభాలు, తదితర అంశాలపై కళాజాత బృందం ద్వారా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బ్రాంచి మేనేజర్, సొసైటీ ప్రెసిడెంట్ స్తోత్రరాజు, తిరుపతి కుమార్, సాయికృష్ణ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

POTHU HARISCHANDRA PRASAD అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.05-02-2014న L6995222 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరుచేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్సు కాపీలు తీయించుకునేందుకు ది.05-12-2023 న ఏనుగువానిలంక గ్రామం నుండి యలమంచిలి గ్రామం వెళుచుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన, నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుతున్నాను.

POTHU HARISCHANDRA PRASAD
S/o. Pothu Krishna
D.No. 1-49, Main Road, Yenuguvani Lanka
Yelamanchili Mandal, W.G.Dt. A.P.

(By Court Order)
మహారాజశ్రీ చీరాల సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో
E.P.No.21/2023
in
O.S.No. 104/2018

Between:-
గ్రంధి రమేష్ బాబు తండ్రి బాల సుబ్రహ్మణ్యం వయసు 43 సం.లు, R/o డోర్ నెం. 15-18-5/2, పాపరాజుతోట, చీరాల .....D.H.R
మరియు
1) జంగం శ్రీలత, భర్త డానియేల్ వయసు 57 సం.లు, గృహిణి.
2) జంగం షైనీ ప్రవీణ, తండ్రి డానియేల్ వయసు 37 సం.లు, డిపెండెంట్,
3) జంగం స్మైల్ ప్రియాంక, తండ్రి డానియేల్, వయసు 35 సం.లు, డిపెండెంట్, పై తెల్పిన 1 to 3 వార్ల నివాసం Door No.25-1023 నవ్య రెసిడెన్షియల్ అపార్టుమెంటు ప్రక్కన నరసింహారావుపేట, ఫైర్‌స్టేషన్‌రోడ్, ఏలూరు-టౌన్ & డిస్ట్రిక్ట్ ..J.D.RS

పైనంబరు E.Pని పై తెల్పిన D.H.R. ఆర్డర్ 21 రూలు 52 ఆఫ్ సి.పి.సి క్రింద J.D.Rs పైదాఖలు చేసిన తరువాత, పై నంబరు E.P.లో J.D.Rs.కు ఎన్నిసార్లు నోటీసులు పంపినను జారీకానందున, కోర్టు వారి ఆదేశాల మేరకు తెలియ జేయునదేమనగా పైనెంబర్ E.P.లో మీకేమైనా ఆక్షేపణలు ఉన్న యెడల ది.02-01-2024న ఉదయం గం.10-30 ని. లకు పై తెల్పిన కోర్టులో మీరు స్వయముగా కానీ లేక మీ అడ్వకేట్ ద్వారాకాని హాజరై మీకోపణలు కోర్టువారికి తెల్పు కోవలసినది. లేనిచో పైనంబరు E.Pని మీపరోక్షమందు విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా మీకు తెలియ జేయటమైనది.

చీరాల
ది : 15-12-2023
ఇట్లు
కొణికి శేషగిరిరావు
డి.హెచ్.ఆర్.తరపు అడ్వకేట్
కొట్ల బజార్, చీరాల

మహారాజశ్రీ తణుకు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 271/2020

వాది: ఇందుగపల్లి శ్రీనివాసరావు
మరియు
ప్రతివాది: నుక్కుల భీమశంకర్, S/o. రామారావు, సా॥ డో.నెం. 11-1-77, పంజా సెంటర్, మసీదు వద్ద, నరసాపురం.

వాది చేయించిన ప్రకటన

పై నెంబరు దావాను, వాది ప్రామిశరీ బాకీ గురించి 1వ ప్రతివాది అయిన నుక్కుల భీమశంకర్, మీపైన పై నెంబరు దావాను దాఖలు చేయగా, 1వ ప్రతివాది అయిన మీరు శ్రీ కోర్టు వారి దావా సమనులను మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచూ ఆలస్యం చేయుచున్నందున ఈ పత్రికా ప్రకటన ద్వారా మీకు దావా సమన్సు అమలు జరుగు నిమిత్తం ది. **05-01-2024వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు గాని, మీ తరపు అడ్వకేట్ వారు గాని స్వయముగా హాజరయ్యి మీ ఆక్షేపణలను తెలియపరచుకొనవలెను. లేనిచో మీపైన పరోక్షముగా తీర్మానించబడునని తెలియపరచడమైనది.

వాయిదా తేది: 05-01-2024

జి.ఎన్.వి.ఎస్.సిహెచ్.వై.ప్రసాద్
వాది తరుపున అడ్వకేట్
తణుకు, సెల్:7799235999
తణుకు
15-12-2023

ప్రకటన
మహారాజశ్రీ 3వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి, పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం
ఎ.ఎస్.నెం. 4/2023

బిట్వీన్:
వాదులు : అప్పీలేట్ - 1) ఎండి అస్లం పాషా - అప్పిలెంట్
2) ఎండి మొహిద్దీన్ పాషా-అప్పిలెంట్
3) ఎండి బాజి మైనుద్దీన్ - అప్పిలెంట్
ప్రతివాదులు : రెస్పాండెంట్స్ : 1) వాసాకా మేరీ పుష్పం
2) వాసాకా సుబ్బారావు

ఆర్డరు తేది : ది.29-11-2023

1వ రెస్పాండెంట్ : వాసాకా మేరీ పుష్పం, భర్త : సుబ్బారావు, డోరు నెం. 15-12-28, పాలూరి వారివీధి, 18వ వార్డు, భీమవరం-534201, పశ్చిమగోదావరి జిల్లా
2వ రెస్పాండెంట్ : వాసాకా సుబ్బారావు, s/o. నరసయ్య, డోరు నెం. 15-12-28, పాలూరి వారి వీధి, 18వ వార్డు, భీమవరం - 534201, పశ్చిమగోదావరి జిల్లా

పై నెంబరు ఎ.ఎస్.నెం. 4/2023లో శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం 2వ రెస్పాండెంట్ ఎన్ని పర్యాయములు కోర్టు ద్వారా నోటీసులు పంపినను అందుకొనలేదు. సదరు ఎ.ఎస్.నెం. 4/2023లో ది.29-12-2023వ తేదీన వాయిదా అయివున్నది. సదరు తేది ఉదయం 10-30 గం॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరు అయి, తమ సంజాయిషీని తెలుపుకోగలరు. లేని యెడల మీపై పరోక్షముగా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

షేక్ రోషన్, ఎం.ఎ.బిఎల్.,
అడ్వకేట్, భీమవరం, సెల్: 9441750986
భీమవరం, తేది : 15-12-2023